RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు
www.tholiaksharam.com
ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 284 పేజీలు - 08 మంగళవారం 08 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



## రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

**'గ్లోబల్ సమ్మిట్'పై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు**

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ - తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు

మిగతా2లో...

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**● బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ● కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు ● పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర ● దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి ● సర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది

మిగతా2లో...

## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన


**- గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 7(పిసిడబ్ల్యూ న్యూస్):** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును

మిగతా2లో...

## తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు




**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** మరోసారి సమగ్ర ఓటర్ జాబితా(సర్) ప్రక్రియ గడువును ఎన్నికల సంఘం పెంచింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. ముందుగా ఈ నెల 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు

మిగతా2లో...

## మహిళా ఎమ్మెల్యేలపై దాడికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత

**● పోలీసులపై చర్యలు తీసుకోవాలి :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ● సీఎం క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం ● ఇదేనా ఇందిరమ్మ ప్రజాపాలన ? ● బీఏసీ సమావేశం బహిష్కరణ**



**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:**మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. సీఎం క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్ట బోమని చెప్పారు. ఆడబిడ్డల చీరలు లాగి గొంతులు పట్టి జుట్టు లాగడమే ఇందిరమ్మ ప్రజాపాలన అని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వెయ్యి రోజుల ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామనే భయంతోనే ప్రభుత్వం తమను అడ్డుకుందని చెప్పారు. రాహుల్‌గాంధీకి ఒక నిబంధన, తమకు మరో నిబంధన వర్తిస్తుందా?అని

మిగతా2లో...

## ఆరావళి కొండల నిర్వచనం.. హైపవర్ కమిటీ గడువు పొడిగింపు



**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** ఆరావళి కొండల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణపై సుప్రీంకోర్టు హైపవర్ కమిటీ (హెచ్‌పీసీ)ని నియమి ంచిన విషయం తెలిసిందే. సదురు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక సమర్పణపై గడువు పొడిగించాలని ఉన్నత న్యాయస్థా నాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం ఈ ఏడాది నవంబర్ 30 వరకు ధర్మాసనం

మిగతా2లో...



## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ**

**ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు**

**22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం**

**సభ సజావుగా సాగేందుకు సహకరించాలి**

**22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ**

**వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి**

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ

మిగతా2లో...

## తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

**- సీఎం రేవంత్ రెడ్డి**




**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:**శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా

మిగతా2లో...

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**- రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు**



2లో

## అసెంబ్లీలో స్పీకర్ కంటతడి



**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్‌ను కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంఘీ భావం తెలిపారు. ఈక్రమంలోనే స్పీకర్ భావోద్వేనికి గురైయ్యారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బీజేపీకి కూడా బాధ్యత ఉందని చెప్పారు. బీజేపీ నేతలు సభకు సహకరించాలని కోరారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అవమానించడంపై బీజేపీ వైఖరి చెప్పాల ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఇష్టారాజ్యంగా వ్యవ హ రిస్తున్నారని ధ్వజ మెత్తారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయ డం దుర్మా ర్గమని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ రూల్స్ పాటించలేదని.. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ రూల్స్ పాటించట్లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహించారు. అయితే, స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. దళిత, మహిళా వ్యతిరేకి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. దళితులపై చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?అని సవాల్ విసిరారు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించామనీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్లకు వెళ్తామని అన్నారు. సీఎం కూడా ఎమ్మెల్యేనే అనీ, స్పీకర్ పక్షపాత వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు.నెలరోజులపాటు అసెంబ్లీ సమావేశాలను నడపాలని కోరారు.

యాదవరెడ్డి, జగదీశ్‌రెడ్డి, శంభీపూర్ రాజు, సంజయ్, హరీశ్‌రావుతోపాటు తనను కూడా పోలీసులు గాయపరుస్తూ ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

**జగదీశ్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ** అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన తోపులాటలో అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రితో చికిత్స పొందుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది.

ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూని స్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడికే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూని స్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

# ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు.

బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.

రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు.

దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు.

బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు.

నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు.

పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు.పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

## ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా

## 12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు

**తొలి అక్షరం/బాఘ్‌పత్,సెప్టెంబర్ 7:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణి కులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి



గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగి స్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**తొలి అక్షరం/హైదరాబాద్ సెప్టెంబర్ 7:** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఉద్రిక్తతల పై రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఎమ్మెల్యేలపై పోలీసులు చర్యలు తీసుకో వద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యే లపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను గుర్తించాలని, ఈ ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ అంశంలో డిజిపి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడలేకపోతున్నారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక ఆలోచనను సరిదిద్దకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవన్నారు. ఈ రకమైన అవమానం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశానికి సంబంధించి కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌ను అభ్యంతరకర భాష మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలన్నారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని.. లేకపోతే బర్తరఫ్ చేయాలన్నారు. తాము ఏం మాట్లాడినా వెనుక కేసీఆర్ ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మరోసారి సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించినట్లు తెలిపింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన తర్వాత నవంబర్ 9న తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

# ఆరావళి కొండల నిర్వచనం.. హైపవర్ కమిటీ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

గడువు ఇచ్చింది. ఫిబ్రవరి 2027 వరకు గడువు పొడిగించాలన్న కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అవసరమైతే కమిటీ "పగలు రాత్రి" పనిచేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.
ఇకపై ఎలాంటి పొడిగింపు ఇవ్వబోమని స్పష్టం చేసింది. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన వర్గాలతో సహా సంబంధిత వర్గాలన్నింటి వాదనలు వినాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి హెచ్‌పీసీ మరో ఆరు నెలల సమయం కోరింది. ఈ విషయంపై తదుపరి విచారణ డిసెంబర్ 2న జరగనుంది.

# రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్‌ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు.సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడి దారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు



**తొలి అక్షరం/హైదరాబాద్:సెప్టెంబర్ 7:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు.పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం...

**జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన**

**క్షేత్ర స్థాయిలోని ప్రతి సమస్యను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరిస్తాం**

**రాజ్యాంగ పరిరక్షణ**

**ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత**

**ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలి**




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్-07:** ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు.ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా తెలుసుకోవడమే ఎన్నికల సంఘం ఉద్దేశ్యమని పేర్కొన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చని, చిన్న సమస్య అయినప్పటికీ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధృవపత్రాల్లో అవసరమైన ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, అధికారులు తమ స్థాయిలో ధృవ పత్రం సమర్పణ నుంచి మినహాయింపు ఇవ్వలేరని పేర్కొన్నారు.వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు, పేర్లలో అక్షర దోషాలు, ఇతర చిన్నపాటి క్లరికల్ తప్పిదాలను స్వీయ ప్రకటన ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన అంశాల్లో ఎన్నికల సంఘం సూచించిన ధృవ పత్రాల్లో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధృవ పత్రాలపై రాజకీయ పార్టీలు అవగాహన కల్పించి, విచారణకు హాజరయ్యే సమయానికి సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా సహకరించాలని కోరారు. రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం అందరితో సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, టిడిపి పార్టీ ప్రతినిధి సిహెచ్. రాజరాజేశ్వరి, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బీఆర్ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టీబీ పేషెంట్లకు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి...

**ప్రతి టీబీ పేషెంట్‌కు పోషకాహార కిట్లు అందేలా రెడ్‌క్రాస్, సత్యసాయి సొసైటీలు ముందుకు రావాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



**తొలి అక్షరం,ఖమ్మం, సెప్టెంబర్- 07:** జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు ఆరు నెలలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిక్షయ్ కార్యక్రమం క్రింద టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సుమారు 3,000 మంది టీబీ పేషెంట్లు ఉన్నారని, ప్రతి పేషెంట్‌కు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు సత్యసాయి సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రతి టీబీ పేషెంట్‌కు న్యూట్రిషన్ కిట్లు అందేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎక్కువ మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో సుమారు 12 వేల న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశామని, ప్రస్తుతం కిట్ల పంపిణీ సంఖ్య తగ్గిందని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సత్యసాయి సొసైటీలు ఈ అంశంపై సమీక్ష నిర్వహించి, జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు నిరంతరం పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవడానికి మందులతో పాటు మంచి పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నిక్షయ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. న్యూట్రిషన్ కిట్లలో పల్లీలు, 1.5 కిలోల పప్పు, 1 కిలో బియ్యం, పావు కిలో వంట నూనె ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో జరగని ఎన్నో పనులకు ప్రజా ప్రభుత్వంలో శ్రీకారం

**సమస్యాత్మక ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నూతన ఒరవడి..**

**ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నాం**

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**






**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గతంలో సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతూ...నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్‌లో పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వెనుక ప్రాంతంలో,6వ డివిజన్‌లోని పద్మశాలీవాడలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.సుమారు రూ.90 లక్షల వ్యయంతో,52వ డివిజన్‌లో రూ.60 లక్షలు,6వ డివిజన్‌లో రూ.30 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,సంబంధిత అధికారులు,డివిజన్ నాయకులు,కాలనీ వాసులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.రోడ్ల పరిస్థితి,డ్రైనేజీ,పారిశుద్ధ్యం,మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ...నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు.చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.పనులు ప్రారంభించిన తర్వాత నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వేగం పెరిగిందని ఎమ్మెల్యే నాయిని అన్నారు.గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంతో పాటు కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే సూచనలు,అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని,ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేయిస్తున్నామని చెప్పారు.రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని మరిన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మాజీ కార్పొరేటర్ చాడ స్వాతి,శ్రీనివాస్ రెడ్డి,సుగుణాకర్ రెడ్డి,శివాజీ,అజీమ్ స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,డివిజన్ అధ్యక్షులు,అధికారులు, కార్యకర్తలు,కాలనీ పెద్దలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**● ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**తొలి అక్షరం,ఖమ్మం, జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్- 07:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి తమ పిల్లలకు షుగర్, కిడ్నీ వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాలకు పోలీసుల అనుమతులు ఆన్‌లైన్‌లో పొందాలి

**- ఉత్సవ నిర్వాహకులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

**- జి. మన్మధ కుమార్ పోలీసు ఇన్‌స్పెక్టర్ చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 07:** గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీసు అనుమతులను తెలంగాణ రాష్ట్ర పోలీసు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందాలని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ సూచించారు.గణేష్ ఉత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులో మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు. సంబంధిత పోలీసు అధికారులు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతులు జారీ చేస్తారని పేర్కొన్నారు. అనుమతి పొందిన అనంతరం చతురస్ర సంకేతం ద్వారా లేదా అంతర్జాల అనుమతి పత్రం ద్వారా అనుమతి వివరాలను పొందవచ్చని తెలిపారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ధ్వని కాలుష్య నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.అలాగే ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసు అధికారులు సూచించే భద్రతా చర్యలను పాటిస్తూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ కోరారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం 100 లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు.

# పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన బొద్దిరెడ్డి



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,ఆత్మీయ సోదరులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షులుగా రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ...రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత సేవ చేసేందుకు మీకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవి రావాలని,తప్పకుండా వస్తుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.

# జిల్లా స్థాయి యోగాసన పోటీలలో 'శ్రీ రామకృష్ణా సేవా సమితి' సాధకులకు బంగారు,వెండి పతకాలు








**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన హనుమకొండ జిల్లా స్థాయి యోగాసనాల ఛాంపియన్ షిప్-2026 పోటీలలో హనుమకొండకు చెందిన శ్రీ రామకృష్ణా సేవా సమితి యోగా సాధకులు అద్భుత ప్రతిభ కనబరిచారు.45 సంవత్సరాల పైబడిన మహిళల విభాగంలో శ్రీ రామకృష్ణా సేవా సమితి కేంద్రంలో శిక్షణ పొందిన ఇద్దరు మహిళలు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయిలో సమితి కీర్తిని చాటారు.ఈ పోటీలలో రజిని రెడ్డి ప్రథమ బహుమతి(బంగారు పతకం) సాధించగా,విజయ ద్వితీయ బహుమతి(వెండి పతకం) కైవసం చేసుకున్నారు.విజేతలుగా నిలిచిన సాధకులకు శ్రీ రామకృష్ణా సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణరెడ్డి,కార్యవర్గ సభ్యులు ప్రత్యేక అభినందనలతో శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని,శారీరక,మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.జిల్లా స్థాయి పోటీలలో పతకాలు సాధించి సమితికి మంచి పేరు తెచ్చిన మహిళా సాధకులను ఆయన అభినందించారు.యోగా గురువు ఆంజనేయులు 35-45 సంవత్సరాల మధ్య వయస్కుల యోగా పోటీల్లో బంగారు పథకం పొందడం ఎంతో ప్రశంసనీయం అని అన్నారు.అలాగే వారికి విశేష శిక్షణ అందించి,విజేతలుగా తీర్చిదిద్దిన యోగ గురూజీ ఆంజనేయులు సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని నర్సంపేట టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం లోని లబ్ధిదారులు పెండ్యాల అర్చన -శ్రీనివాస్ కు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు రంజిత్ రెడ్డి, ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో నర్సంపేట నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ పారదర్శకంగా అందుతున్నాయని, నిరుపేదల అభ్యున్నతికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్ జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్స్ రావుల మహిపాల్ రెడ్డి బొమ్మెరాబోయిన రమేష్,గుంటుపల్లి ప్రభాకర్ రావు చల్లా పాపి రెడ్డి మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు షైక్ షబ్బీర్ మహ్మద్ అన్వర్ అంబేద్కర్ సంఘ పట్టణ అధ్యక్షులు ఇదునూరి శివాజి దంతల శ్యామ్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సోంటి రెడ్డి రంజిత్ రెడ్డి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భక్కి అశోక్**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ వాస్తవ్యులు సీనియర్ ఆంధ్రజ్యోతి విలేకరి గిరగాని శ్రీనివాస్ -హైమ ల కుమార్తె సరయు -సాయి శ్రావన్ ల ఎంగేజ్మెంట్ కార్యక్రమం లో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్,జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, సోసైటీ చైర్మన్ రెడ్లవాడ ఆవుల శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజెటి బిక్షపతి,రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,మాజీ సోసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ మార్కెట్ డైరెక్టర్స్ రావుల మహిపాల్ రెడ్డి,బొమ్మెరాబోయిన రమేష్ దొడ్డ విజయ్ సోసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి మైనారిటీ కాంగ్రెస్ నాయకులు షైక్ షబ్బీర్ మహ్మద్ అన్వర్ మెట్టు నర్సింహా రెడ్డి గుంటుపల్లి ప్రభాకర్ రావు రావుల భాస్కర్ రెడ్డి తాళ్లపెల్లి చెన్న కేశవులు గరికపాటి కృష్ణ రావు మహ్మద్ అమీర్ దేవానబోయిన విజేందర్ నంగునూరి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పోరండ్ల సమ్మక్క పార్దివాదేహాని కి పూల మాల వేసి నివాళులు అర్పించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ వాస్తవ్యులు పోరండ్ల శ్రీనివాస్ తల్లి గారైన పోరండ్ల సమ్మక్క అనారోగ్యం తో మరణించగా వారి పార్దివదేహానికి పూల మాల వేసి అంతిమ యాత్రలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వార్డ్ సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్,రామరాపు రాము,ఇదునూరి ప్రభాకర్ నాదెండ్ల ప్రసాద్,పోరండ్ల వీరన్న పోరండ్ల రాంచంద్రం, పొట్లపల్లి సుమన్ సార్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు గిరగాని శ్రీనివాస్ కుమార్తె నిశ్చితార్థం కార్యక్రమంలో పాల్గొన్న నెక్కొండ మాజీ పిఏసిఎస్ చైర్మన్ మారం రాము.

**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు గిరగాని శ్రీనివాస్, కుమార్తె సరయు,& సాయి శ్రవణ్, నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన. నెక్కొండ మాజీ పిఏసిఎస్ చైర్మన్ మారం రాము . ఈదునూరి యాకయ్య, అడ్వకేట్ బొడ్డుపెల్లి అజయ్, గరికపాటి కృష్ణారావు, రాపాక శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, కొనిజేటి బిక్షపతి, నర్సంపేట అడ్వకేట్ అంబాల సుధీర్, జంపాల కేదారి, మహేంద్ర సింగ్ ధోని తదితరులు పాల్గొన్నారు.



# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 10న మహా ధర్నా**



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి జి ఇ జాక్ ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10, 2026న నిర్వహించనున్న “చలో హైదరాబాద్ మహా ధర్నా” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయడానికి సంబంధించి సన్నాహక సమావేశం,పోస్టర్ ఆవిష్కరణ,ప్రెస్ మీట్ టీఎన్‌జీఓస్ భవన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా టి జి ఇ జాక్ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్,సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రధానంగా 2వ వేతన సవరణ సంఘం (2వ పి ఆర్ సి) నివేదికను వెంటనే అమలు చేసి,01.07.2023 నుండి 51% ఫిట్‌మెంట్ మంజూరు చేయాలని,ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు.సుమారు రూ.10,000 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు,పెన్షనర్ల బిల్లులను వెంటనే చెల్లించాలి.ప్రతి నెలా కనీసం రూ.2,000 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, సి పి ఎస్ ను రద్దు చేసి,పాత పెన్షన్ విధానం (ఒ పి ఎస్)ను పునరుద్ధరించాలి,ఉద్యోగులు,పెన్షనర్ల కోసం ఎన్ ఇ హెచ్ ఎస్(న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్)ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి అన్నారు.ఉద్యోగ సంఘాలకు గుర్తింపు పునరుద్ధరించి,ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘాలతో చర్చలు జరపాలి.ఉద్యోగులు,ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని,రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు, పెన్షనర్లలో చలో హైదరాబాద్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తూ సన్నాహక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టి జి ఇ జాక్ నాయకులు తెలిపారు.ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు పెన్షనర్లు ఎదురుకొంటున్న సమస్యలు కేవలం వ్యక్తిగత సమస్యలు కాదని,లక్షలాది కుటుంబాలకు సంబందించినది అని నాయకులు పేరుకొన్నారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహా ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టి జి ఇ జాక్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.ఇంకా ఈ కార్యక్రమంలో టి ఎన్ జి ఓ రాష్ట్ర కార్యదర్శి ముజీబ్ హుస్సేన్,అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్,కస్తూరి వెంకట్,రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు,టిజిఓస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్,టి జి ఈ జాక్ వరంగల్ జిల్లా చైర్మన్ గాజె వేణుగోపాల్,జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, గౌరవ అధ్యక్షులు గజ్జెల రాంకిషన్,టీజీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పనికుమార్,రాజేష్ రెడ్డి పి ర్ టి యూ టి స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి టి ఎస్ యు టి ఎఫ్ తాటికాయల కుమార్,సుజన్ ప్రసాద్,ఎస్ టి యు టి ఎస్ కుమార స్వామి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘశీ సాంబయ్య,భానుప్రకాష్,టి పి టి ఎఫ్ ఉట్కూరి అశోక్,టి ఆర్ టి ఎఫ్ కిషన్,డిటిఎఫ్ గోవింద రావు,టి పి ఆర్ టి ఎఫ్ శ్రీనివాస రెడ్డి,పెన్షనర్ల సంఘశీ నాయకుడు ధర్మరాజు,సోమయ్య, సారంగపాణి,సదానందం,సాంబయ్య,టి ఎన్ జి ఓ జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్,సిటీ అధ్యక్షులు శంకేసి రాజేష్,గద్దల రాజు,రఘు,శరత్ కుమార్, గంగాధర్,గణేష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పోచమ్మకుంటను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా: నాయిని

***పోచమ్మకుంటలో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన***

***ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నా: పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి***





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ పోచమ్మకుంటలో రూ.40 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.పోచమ్మ బోనాల సందర్భంగా పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ...ఎన్నికల ముందు పాదయాత్రలు, ప్రజలతో సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి,సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.పోచమ్మకుంట తనకు ప్రత్యేకమైన ప్రాంతమని,తన ఇల్లు కూడా ఇదే డివిజన్‌లో ఉండటంతో ఈ ప్రాంత అభివృద్ధిపై మరింత శ్రద్ధ వహిస్తున్నానని చెప్పారు.ప్రజలు తమకు అవసరమైన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు అందిస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.పోచమ్మకుంటలో కమ్యూనిటీ భవన్ నిర్మాణం,పోచమ్మ దేవాలయ అభివృద్ధి,అంతర్గత రోడ్ల నిర్మాణం తదితర పనులకు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.రోడ్లకు సంబంధించిన పనులను త్వరలోనే పరిశీలించి,ఏయే ప్రాంతాల్లో రోడ్లు అవసరమో గుర్తించి పనులు చేపడతామని చెప్పారు.అదేవిధంగా పోచమ్మకుంట శ్మశానవాటికను ఆధునికంగా,సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.గార్డెన్ తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన గదులు,ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని,అభివృద్ధి పనుల విషయంలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.రెవెన్యూ,పోలీస్ శాఖల సమన్వయంతో అవసరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.పోచమ్మకుంట ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా గత పాలనలో జరిగిన అభివృద్ధి,ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు.కులం,పార్టీ పేరుతో కాకుండా ప్రజలకు ఎవరు అభివృద్ధి చేస్తారో వారిని ఆదరించాలని కోరారు.ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.పోచమ్మకుంటను ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే నాయిని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గుంటి స్వప్న, నల్లాల సత్యనారాయణ,విద్యాసాగర్,గాండ్ల స్రవంతి,గుంటి శ్రీనివాస్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**ఎమ్మెల్సీ తాత మధును వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్**

**అంబేద్కర్ జంక్షన్ వద్ద దిష్టిబొమ్మ దగ్ధం**

**సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఎంఎల్సీ మధుపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు**





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** దళిత సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరసన కార్యక్రమం చేపట్టారు.పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు అరూరి సాంబయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని,స్పీకర్ చైర్‌ను అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని అవమానమని మండిపడ్డారు.దళిత వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని,ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.తాత మధు వ్యాఖ్యలపై ప్రభుత్వం,సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎమ్మెల్సీ తాత మధుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు .ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగ వ్యవస్థను అవమానించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.ఎమ్మెల్సీ తాత మధును వెంటనే భర్తరఫ్ చేయాలని,ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశాయి.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,మేర సంఘం చైర్మన్ వెంకటరాజం,ఎనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక అనిల్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ,లీగల్ సెల్ చైర్మన్ తోట రాజ్ కుమార్,మైనారిటీ సెల్ చైర్మన్ అజిజ్ ఉల్లా బేగ్,ఐఎన్టియుసి కూర వెంకట్,మీడియా సెల్ ఇంచార్జ్ మార్క విజయ్,మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు,పోతుల శ్రీమన్నారాయణ,జక్కుల రవీందర్ యాదవ్,మామిండ్ల రాజు,బోడ డిన్న,నసీం జహాన్,నాయకులు అంబేద్కర్ రాజు,అంకుస్,కార్తీక్,సమత,రహీమున్నీసా,డివిజన్ అధ్యక్షులు గాండ్ల స్రవంతి తదితరులు హాజరయ్యారు.

# అధికారులు నిబద్ధతతో పనిచేయాలి...:కలెక్టర్ స్నేహ శబరిష్

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 07:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్బద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. సోమవారం జిల్లా సంయుక్త కలెక్టరేట్ సమావేశ మందిరంలోఅదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, న్యాయ సేవ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్, అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రక్రియలో ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజావాణికి వచ్చే అర్జీదారులు తమ దరఖాస్తును స్పష్టమైన అక్షరాలతో రాయాలి. వినతిపత్రంలో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కనాలని,సమస్యకు సంబంధించిన అవసరమైన ధృవీకరణ పత్రాలు (ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం మొదలైనవి) నకళ్లను అర్జీకి జత చేయాలని ప్రజావాణి నిర్వహించే రోజున (ప్రతి



సోమవారం) ఉదయం 10:30 గంటల లోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. టోకెన్ ప్రాతిపదికన మాత్రమే అధికారులను కలవాల్సి ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించి, సహకరించాలి. పాత దరఖాస్తులు: ఇదివరకే దరఖాస్తు చేసుకుని ఉంటే, ఆ పాత దరఖాస్తు లేదా ఐడీ నంబర్‌ను కొత్త అర్జీతో పాటు సమర్పించాలి. జిల్లాలోని అన్ని శాఖల ముఖ్య అధికారులు ప్రజావాణికి ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తప్పనిసరిగా హాజరుకావాలని, అత్యవసర పరిస్థితి ఉంటే మినహా ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కాకూడదని సూచించారు. త్వరితగతిన పరిష్కారం: స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కరించి క్షేత్రస్థాయి పరిశీలన సమస్య తీవ్రతను బట్టి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి స్వయంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు, దరఖాస్తుపై తీసుకున్న చర్యలు లేదా తిరస్కరించడానికి గల సరైన కారణాలను అర్జీదారునికి లిఖితపూర్వకంగా లేదా ఎస్ఎమ్ఎస్ ద్వారా తెలియజేయాలనీ,ఆన్‌లైన్ స్టేటస్ అప్‌డేట్ ప్రజావాణి పోర్టల్‌లో అర్జీల స్థితిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధికారులకు సహకరించాలని కోరారు. అంతరం వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను వినియోగించాలని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. వివిధ విభాగాలకు చెందిన మొత్తం (144) దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత విభాగాలకు తగు చర్య నిమిత్తం వెంటనే పంపడం జరిగిందని అన్నారు. అంతకముందు నారాయణపురం గ్రామస్తులు దారావత్ రవి నాయక్, యమునా సర్పంచ్, కైక, వెంకట్ రెడ్డి, సుమన్, శ్రీలత లకు పట్టాదార్ పాస్ బుక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంబంధిత విభాగాల సిబ్బంది, పాల్గొన్నారు.

# 420 హామీలు.6 గ్యారంటీలు.. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మోసమే మిగిలింది

**- హామీల అమలుపై చౌటుప్పల్ ఆర్డీఓకు బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం**

**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 07:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ దగా, అవినీతి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మండలం, మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. మునుగోడు ముద్దుబిడ్డ, మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో



ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుర్కాటి నిరంజన్ గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండూరి పరమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, కౌన్సిలర్లు గడ్డం ఇందిరా రాజారత్నం, ఉదరి యాదయ్య, మాజీ గ్రంథాలయ అధ్యక్షుడు ఉడుగు మల్లేష్ గౌడ్, డిల్లీ మాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సూర్వి మల్లేష్ గౌడ్, నాయకులు అత్తార్ పాషా, చెవగోని మహేష్ గౌడ్, ఎం.డి. మున్నా, మెట్టు మహేశ్వర్ రెడ్డి, బొమ్మగోని మల్లేష్ గౌడ్, ఎం.డి. ముషీర్ భాయ్, సంగిశెట్టి శివ, రఘు, ఎం.డి. అబ్బాస్, ఇమ్మడి ఈశ్వర్ గుప్తా, ఎం.డి. అత్తు తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనపు ఏర్పాటు

**- రైతుల వినతికి విద్యుత్ అధికారుల హామీ**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 6:** చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగరాయ చెరువు స్మశానవాటిక సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ పలుమార్లు కాలిపోతుండటంతో పొట్ట దశలో ఉన్న వరి పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన ప్రతిసారీ మరమ్మతులు చేయాల్సి వస్తోందని, ఈ పరిస్థితి కొనసాగితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను సానుకూలంగా పరిశీలించిన విద్యుత్ శాఖ ఎస్ఈ రెండు, మూడు రోజుల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్పందించిన విద్యుత్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ బూరుగు కృష్ణారెడ్డి, సీపీఎం మండల కమిటీ సభ్యులు కొండే శ్రీశైలం, శాఖ కార్యదర్శి ఇట్టబోయిన శేఖర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చప్పిడి లక్ష్మారెడ్డి, సీపీఎం శాఖ కార్యదర్శి చప్పిడి రాఘవరెడ్డి, రైతులు మంద బాల్‌రెడ్డి, ఇట్టబోయిన శివ, కాటం రాజయ్య, ఇట్టబోయిన శంకరయ్య, చప్పిడి కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీసీపీ శిరీషని మర్యాదపూర్వకంగా కలిసిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు

**- కుంగ్ ఫు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించిన డీసీపీ శిరీష**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 07:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ అధ్యర్యంలో కుంగ్ ఫు విద్యార్థులు షాద్ నగర్ పట్టణ డీసీపీ శిరీష ని డీసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డ్స్ - 2026 లో షాద్ నగర్ కు చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబర్చి బహుమతులు, సర్టిఫికెట్స్ గెలుపొందిన సందర్భంగా ఈరోజు షాద్ నగర్ డీసీపీ శిరీషని కలవడం జరిగింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కుంగ్ ఫు, కరాటే నేర్చుకోవాలని తెలిపారు. ప్రస్తుత సమాజం లో పురుషులకు దిటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులకు దిశ నిర్దేశం చేసి అభినందించారు.

## స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణి కార్యక్రమం పాల్గొన్న నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామ పంచాయతీ కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టతమాకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల కు గ్రామ పంచాయతీ ఆవరణలో ముఖ్య అతిధిగా విచ్చేసి నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి చేతుల మీదుగా పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో రెడ్లవాడ సోసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ హంస నరేందర్ మార్కెట్ డైరెక్టర్ దుడిమెట్ల కొమురయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల రాజు సోసైటీ డైరెక్టర్ వెంకట్ రామ్ తెల్ల రేషన్ కార్డ్స్ లబ్ధిదారులు గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వంగాల బాబును పరామర్శించిన టీపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగాల బాబు అల్లుడైన వాలం దాసు బాబు అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహంపై పూలమాలవేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్,నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, వెంకటాపురం సర్పంచ్ జాటోత్ కవిత- అఖిల్, మాజీ సర్పంచ్ హ్యాట్య నాయక్, రెడ్ల వాడ సొసైటీ మాజీ వైస్ చైర్మన్ రోజనాల సంపత్ నాయకులు సురేష్ ఏడయాదగిరి, కుమార్ సుంకేరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్ గ్యారేజీని ప్రారంభించిన నెక్కొండ మాజీ ఎస్ చైర్మన్ మారం రాము.



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం తెలంగాణ సెంటర్ లో మహమ్మద్ బాబు , నవాజ్ ట్రాక్టర్ గ్యారేజ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని శు భాకాంక్షలు తెలియజేసిన. నెక్కొండ మాజీ పిఎసిఎస్ చైర్మన్ మారం రాము , ఈదునూరి యాకయ్య, రావుల భాస్కర్ రెడ్డి, తాళ్లూరి నరసింహ స్వామి, ఇనుగాల రాజేందర్ రెడ్డి, చిదురాల రాజ్ కుమార్, మహమ్మద్ అంకుస్, మహమ్మద్ వలి, పాల్గొన్నారు.

# ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

**• TGEJAC జిల్లా చైర్మన్, కన్వీనర్ వడ్డేబోయిన శ్రీనివాస్,మహమూద్ రఫీ**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 7:** చలో హైదరాబాదును జయప్రదం చేయాలని టిజిఈ జిల్లా చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్, కన్వీనర్ మహమ్మద్ రఫీలు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వఉద్యోగుల, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకై సెప్టెంబర్ 10న టీజీజాక్ తలపెట్టిన ఛలో హైదరాబాద్ ను జయ ప్రదం చేయాలని కోరుతు సోమవారం నేతలు పోస్టర్ ను జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలు దశల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సి పి ఎస్ రద్దు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పీఆర్సీ , పెండింగ్ డీఏల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బిల్లుల పరిష్కారం, ఆరోగ్య పథకం అమలు, తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. "ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం.. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో కదం తొక్కుదాం" అని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, ఫిరోజ్, రమేష్, ప్రసాద్, హాలియా నాయక్, భాస్కర్, గోపికృష్ణ, సత్యనారాయణ, భద్ర నాయక్, రోహిత్, నాగమణి, విష్ణువర్ధన్ రెడ్డి, హరినాయక్, దేవేందర్, రాజు, లక్ష్మీకాంత్, ఉపేందర్, మంజుల, రోహిత్, రాజశేఖర్, బిక్షపతి,పాల్గొన్నారు.

# 250 ఉచిత పి.టి. డ్రెస్సుల పంపిణీ

**- విద్యార్థులకు విద్యతో పాటు క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్&సర్వోదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో, సి ఎస్ ఆర్ నిధుల ద్వారా ఎ.జి.ఎ ఇన్ఫ్రా వారి సహకారంతో వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విలువైన సుమారు 250 ఉచిత పి.టి. డ్రెస్సులను ఫౌండేషన్ చైర్మన్,60వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ వారి కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ...విద్యార్థుల విద్యతో పాటు క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు ప్రణయ్ భాస్కర్ సతీమణి సబితా భాస్కర్,కుమార్తె అపూర్వ భాస్కర్,పాఠశాల కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సురేష్, ఉపాధ్యాయులు,ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు,డివిజన్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీర్నెంలలో ఘనంగా కట్ట మైసమ్మ, కట్ట ముత్యాలమ్మ బోనాల పండుగ



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:** రామన్నపేట మండలం, నీర్నెంల గ్రామంలో కట్ట మైసమ్మ, కట్ట ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రామన్నపేట ఎమ్మార్వో లాల్ బహదూర్ శాస్త్రి కి గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను ఐక్యతతో జరుపుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ శోభ గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తేవడం అభినందనీయం

**- శ్రీ లక్ష్మీనరసింహస్వామి డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్**





**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 6:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి డయాగ్నస్టిక్ ల్యాబ్ను మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన ఆధునిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. అత్యాధునిక పరికరాలతో డయాగ్నస్టిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షల సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.డయాగ్నస్టిక్ ల్యాబ్ నిర్వాహకులు డాక్టర్ సామ వర్షిణి రెడ్డి, నవీన్ రెడ్డిలను ఈ సందర్భంగా చైర్మన్ అభినందించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య పరీక్షలు అందిస్తూ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్, బొడ్డు మోహన్ రెడ్డి, బొడ్డు ఉపేంద్ర, శ్రీధర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన యూత్ కాంగ్రెస్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:**రామన్నపేట మండలం నీర్నెంల గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు గట్టు నరేందర్ మహారాజ్ ఒక ప్రకటనలో అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని తీవ్రంగా ఖండించారు.బడుగు బలహీన వర్గాలకు చెందిన దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ హోదాలో అసెంబ్లీలో ఉంటే, ఆయనను అధ్యక్షా అని సంబోధించలేక కుల అహంకార రాజకీయాలకు తెరలేపుతూ, అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ లో ఉంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు“ అని ఆయన అన్నారు.అనుచిత వ్యాఖ్యలు చేసిన శాసనమండలి సభ్యుడు తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేసి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రావి నారాయణరెడ్డి పోరాటం అజరామరం

**• సీపీఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి**




**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 6:** తెలంగాణ సాయుధ పోరాటంలో, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ యోధుడు రావి నారాయణరెడ్డి చేసిన పోరాటం అజరామరమని సీపీఐ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి అన్నారు.రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా చౌటుప్పల్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనలో నలిగిపోతున్న తెలంగాణ ప్రజలను ఆంధ్రమహాసభ ద్వారా ఏకం చేసి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన గొప్ప యోధుడు రావి నారాయణరెడ్డి అని అన్నారు. సాయుధ పోరాటం ద్వారా పేదలకు భూములు దక్కేలా చేసిన చరిత్ర ఆయనదని పేర్కొన్నారు.1952లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే అధిక మెజారిటీతో రావి నారాయణరెడ్డి విజయం సాధించారని, ఆయనకు లభించిన ప్రజాభిమానం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా, తెలంగాణ సాయుధ పోరాట యోధుడిగా రావి నారాయణరెడ్డి చేసిన సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, కొండూరు వెంకటేష్, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, దాసరి కృష్ణ, ఉబ్బు దర్శన్, దాసరి యాదయ్య, గుండబోయిన భాస్కర్, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలు అస్తవ్యస్తం

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి ధ్వజం**



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 6:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఢిల్లీ మాధవరెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు.రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని, పంటలకు గిట్టుబాటు ధర, కొనుగోళ్ల విషయంలో కూడా అనేక సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత బలమైన పోరాటాలు నిర్వహిస్తామని ఢిల్లీ మాధవరెడ్డి తెలిపారు.


# గ్యాస్ ఏజెన్సీలో అవినీతి





**తొలి అక్షరం :వలిగొండ సెప్టెంబర్ 07:** వలిగొండ మండల కేంద్రంలోని సుమేధ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ తీసుకొని బరువు తక్కువగా ఉన్నది అనే సందేహంతో వినియోగదారుడు అయిన బి.జె.పి జిల్లా సీనియర్ నాయకుడు బంధారపు రాములు గ్యాస్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి ఏజెన్సీ సిబ్బంది ముందే తనిఖీ చెయ్యగా 2.50 కిలోల బరువు తక్కువ రావడం జరిగింది.సిలిండర్ లో ఎటువంటి సమస్య లేదు అని మాకు ఎం తెలియదు ఇండియన్ గ్యాస్ కంపెనీ నుండి అలానే వస్తుంది అని మేనేజర్ తెలియజేసారు. సాధారణంగా సిలిండర్ డెలివరీ సమయంలో బరువు పరిశీలించిన తర్వాతే వినియోగదారులకు అందించాల్సి ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో తూకం వేయకుండానే సిలిండర్‌ను ఇంటి వద్ద దింపి వెళ్తున్నారు చెప్పగా మేనేజర్ వంశీ నిర్లక్ష్య ధోరణికి వ్యక్తం చేశారు.2 గంటల నిరీక్షణ తరువాత తనిఖీ చెయ్యడానికి అని రాకేష్ అనే వ్యక్తి వచ్చి తనిఖీ చేసి వచ్చుర్ బాగోలేదు అని చెప్పాడు.మెకానిక్ మండలంలో సిలిండర్లు డెలివరీ చేసే వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం.నిజానికి మండలంలోని దళారులు ఏజెన్సీ కూటమిగా అయి అవినీతికి పాల్పడుతున్నారు.ఆఫీస్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఎటువంటి డెలివరీ చార్జీలు తీసుకోకూడదు అయిన కానీ ప్రజల వద్ద దౌర్జన్యంగా తీసుకుంటున్నారు.ప్రజలకు నిత్యవసరం అయిన గ్యాస్ ఏజెన్సీలో ఎంతో కాలంగా జరుగుతున్న అవినీతిపై అధికారుల నిర్లక్ష్య ధోరణి గురించి ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఏర్పడుతున్నాయని అని అన్నారు..

# బిజెపి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు



**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 07:** నెల్లికుదురు మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సింగారపు కుమార్ కి నిన్న ప్రజావాణి లో కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నెల్లికుదురు మండల అధ్యక్షుడు చందు రాజ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలో ప్రధాన సమస్యలైన రైతులు విద్యుత్తు కోసం చాలా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోవడం వలన అదేవిధంగా విద్యుత్ అంతరాయం కలగడం వలన రైతుల కోసం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా గ్యాస్ సబ్సిడీ 500 చాలామంది అర్హులకు అందకపోవడం పట్ల ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రజావాణిలో ఎంపీడీవో సింగారపు కుమార్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాస యాకిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు కుక్కల ఐలయ్య, సీనియర్ నాయకులు చెట్ల సంతోష్, జెల్ల రమేష్, సలుగు ప్రవీణ్, మొండం నరసయ్య, బీజేవైఎం జిల్లా సెక్రెటరీ కనుకుంట్ల శ్రీకాంత్, జిలక యాకయ్య, శ్రీను, భూక్య వెంకటేష్ ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేపాల్ వరద బాధితులకు పది వేల రూపాయలు ఆర్థిక సహాయం

**- ముస్తఫ, నగర్‌కు చెందిన ఆర్ ప్రశంస, జన్విత**



**తొలి అక్షరం,ఖమ్మం, జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 07:** నేపాల్ లో ఇటీవల వచ్చిన భారీ వరదల దృష్ట్యా ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన ఆర్. ప్రశంస, ఆర్.జన్వితా తమ పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండి నేపాల్ వరద బాధితు ల సహాయార్థం రూ. 10 వేల చెక్కును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలిసి అందజేశారు

# రామన్నపేటలో ప్రజావాణి / గ్రీవెన్స్ డే - 11 ఫిర్యాదులు స్వీకరణ, 19 మంది అధికారులు హాజరు



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:**రామన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తేదీ 07-09-2026 రోజున మండల ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మొత్తం 30 మంది మండల అధికారులకు సమాచారం ఇవ్వగా 19 మంది అధికారులు హాజరయ్యారు.హాజరైన అధికారుల వివరాలు:ఎంపీడీవో ఏ.రాములు, తహసీల్దార్ సి.లాల్ బహదూర్, ఎంపీఓ ఎండి.రఫీ, ఎంఏవో ఈ.లావణ్య (ఏ ఈ ఓ ), ఏఈ ఆర్డబ్ల్యూఎస్ ఆశిష్ రాఘవ, ఏఈ హౌసింగ్ కె.సురేష్, ఏఈ ఆర్&బి బి.నవీన్, ఏఈ టీజీఎస్పీడీసీఎల్ ఎం.కోటేశ్వర్ రావు, ఏఈ ఇరిగేషన్ రాజేశ్వరి, ఎంఈవో టి.సురేందర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎం.బేబీ శాలిని, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.కె.వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సూపర్వైజర్లు ఎస్.సుజాత, జి.ధనమ్మ, మండల ఆపరేటర్ ఎడు కొండల్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ జి.కళ్యాణి, ఫైర్ డిపార్ట్మెంట్ డి. రామ నరసయ్య, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పి.నాగమణి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఐకెపి) ఏ.నర్సింహా (సి సి డి ఆర్ డి ఏ ), బీసీ వెల్ఫేర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ పి.జ్యోతి, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.వెంకటయ్య తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజల నుండి మొత్తం 11 దరఖాస్తులు స్వీకరించారు.- ఎమ్మార్వో - 01- పంచాయతీరాజ్ - 04- డీఆర్డీఏ - 01- ఏవో అగ్రికల్చర్ - 03- ఏఈ హౌసింగ్ - 01 ఎంఈవో - 01వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# ఉద్యమకారులను గుర్తించాలని ప్రజావాణిలో దరఖాస్తు అందజేత

**- సంగిశెట్టి క్రిస్టఫర్ జోగు అంజయ్య మలిదశ ఉద్యమకారులు**



**తొలి అక్షరం :వలిగొండ సెప్టెంబర్ 7:** స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని వలిగొండలో ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య లు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అందచేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని కానీ ప్రత్యేక వెబ్సైటు ప్రారంభించాలని కాలయాపన చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు ఇప్పటికీ అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని మరికొంతమందిని ఆదుకోవడానికి వేగంగా అడుగులు వేయాలని వారు అన్నారు..

# ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియ మరో 5 రోజుల్లో పూర్తి... మ్యాపింగ్ లేని, అనామలీస్ ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ

- నోటీసు జారీ చేసిన 7 రోజుల అనంతరం నిబంధనల ప్రకారం విచారణ
- హియరింగ్ అనంతరం డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు
- ఎస్ఐఆర్ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్-07:** ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను మరో 5 రోజుల్లో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్, జారీ, విచారణలు, డేటా నమోదు తదితర అంశాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, జనరేట్ చేసిన నోటీసులు, ఓటర్లకు నోటీసుల జారీ, నిర్వహించిన విచారణల వివరాలను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను మరో 5 రోజుల్లో పూర్తి చేస్తామని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన 1.75 లక్షల ఓటర్లకు సంబంధించి ఇప్పటివరకు 1.40 లక్షల నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మిగిలిన నోటీసుల జనరేషన్, సంబంధిత ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను మరో ఐదు రోజుల్లో పూర్తి చేస్తామని, ఇప్పటి వరకు సుమారు 20 వేల విచారణలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎటువంటి మ్యాపింగ్ లేని ఓటర్లు, అనామలీస్ ఉన్న ఓటర్లకు సంబంధించి నోటీసులు తప్పనిసరిగా జనరేట్ చేసి, సంబంధిత ఓటర్లకు జారీ చేస్తున్నట్లు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నోటీసు జారీ చేసిన అనంతరం కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండేలా చూసి విచారణ నిర్వహిస్తున్నట్లు, విచారణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూమి అక్రమ రిజిస్ట్రేషన్... : మాజీ కార్పొరేటర్ పై భూ కబ్జా కేసు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** దేవాలయ భూమిని అక్రమంగా రిజిస్ట్రే షన్ చేయించుకున్న ఘటనలో 56వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సిరంగి సునీల్ పై కేసు నమోదు అయింది.హనుమకొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఒ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.2012లో 56వ డివిజన్ పరిధిలోని స్థాయికృష్ణ కాలనీలో ఏడెకరాల స్థలాన్ని దేవసాని సాంబయ్య,మారం కొమురారెడ్డిలు కలిసి 76 ప్లాట్లు చేసి విక్రయించారు.ఇందులో 3500 గజాల స్థలాన్ని చిల్డ్రన్ పార్కు కోసం కేటాయించారు.2014లో ఆ స్థలంలో అమ్మ వారి ఆలయాన్ని నిర్మించారు.2012లో దేవసాని సాంబయ్య మృతి చెందాడు.అనంతరం ఆ స్థలంలోని 1320 గజాలు దేవసాని సాంబయ్య,మారం కొమరారెడ్డి సంతకాలను మాజీ కార్పొరేటర్ సిరంగి సునీల్ ఫోర్జరీ చేసి గిఫ్ట్ డీడ్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.దీనిపై సాయికృష్ణ కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరంగి సునీల్,సిరంగి సంపత్ కుమార్,దుబ్బాక నటరాజులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# కేశవ బోయిన పుల్లయ్య మృతి చాలా బాధాకరం: మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే చాంద్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:**రామన్నపేట పట్టణానికి చెందిన కేశవ బోయిన వెంకటేశం టీచర్ తండ్రి, రిటైర్డ్ ఉద్యోగి కేశవ బోయిన పుల్లయ్య తేదీ 07-09-2026 రోజున పరమపదించారు.విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే చాంద్ వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం జరిగిన శివయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కందుల నరసింహ, పెద్ద బోయిన మురళి, కందుల హనుమంతు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్ మా హక్కు భిక్ష కాదు



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 7:** స్కాలర్షిప్ మా హక్కు బిక్ష కాదని డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయికుమార్, గూగుల్ సూర్య ప్రకాష్ లు అన్నారు. సోమవారం లిబిబీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ & డీఎస్పీ పార్టీ జిల్లా కన్వీనర్ ముంజల రాజేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలో తలపెట్టిన ధర్నాకు డిఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ & ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.హామీలతో అధికారంలోకి వచ్చి.. విద్యార్థుల హక్కులను గాలికి వదిలేసిన ప్రభుత్వానికి ఇదే మా హెచ్చరిక....!లిబి"విద్యార్థుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి లేకపోతే ప్రభుత్వాన్ని నిలదీస్తాం, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు సంతోష్,ఇస్లవత్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 6 గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలి

**- ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:**నకిరేకల్ నియోజకవర్గం తేదీ 07-09-2026 రోజున ఉదయం 10:30 గంటలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ డే సందర్భంగా రామన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు చేయనందున, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు 6 గ్యారెంటీలు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం హామీలు నెరవేర్చలేదు. 6 గ్యారంటీలు అమలు చేయాలని రాజ్యాంగబద్ధంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతుంటే వారిని బలవంతంగా అరెస్టు చేస్తున్నారు. అందులో మాజీ మంత్రులు, మహిళా నాయకులు ఉన్నారని చూడకుండా పోలీసులు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడం సరైంది కాదు.కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ బ్లాక్ టీ షర్ట్ రాజ్యాంగం బుక్ పట్టుకొని పార్లమెంట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తే తప్పులేదు కానీ, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రాజ్యాంగబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే తప్పేంటి? మీకు చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయండి, లేకుంటే రాజీనామా చేయండి" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బందెల రాములు, పోషబోయిన మల్లేశం, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బొక్క మాధవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, పులిపలుపుల వీరస్వామి, గొలుసుల సత్తయ్య, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, దోమల సతీష్, గాదె. పారిజాత, ఎండి అమీర్, కోళ్ల స్వామి, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, తెలంగాణ ఉద్యమకారుడు ఎస్కే చాందు, మందడి సాగర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, బత్తుల వెంకన్న, కాటేపల్లి యాదయ్య, కోళ్ల కిషన్, మంటి లింగస్వామి, జంగిలి నరసింహ, నల్ల స్వామి, తాళ్ల క్రాంతి కుమార్, చొప్పరి నరసింహ, బండ శ్రీనివాస్ రెడ్డి, మామిళ్ళ అశోక్, గంగుల రాఘవరెడ్డి, గుండాల రాంబాబు, నక్క నరేందర్, పులిగిల్ల పరమేష్, ఎండి అజాజ్, ఆవుల శ్రీధర్, జాల అమరేందర్ రెడ్డి, నల్ల సైదులు, రాస వెంకటేశ్వర్లు, బలువుల కృష్ణ, గర్దాస్ కరుణాకర్, బత్తిని మహేష్, కూనూరు లింగస్వామి, గాది శంకర్, మామిళ్ళ కుమార్, బాసాని రాజు, బీరం రాజిరెడ్డి, మందడి నర్సిరెడ్డి, చలమల్ల బిక్షం రెడ్డి, గట్టు శేఖర్, వంగాల సాయి తదితరులు పాల్గొన్నారు.

# రావి నారాయణరెడ్డి 35వ వర్ధంతికి సిపిఐ ఘన నివాళి...

**- సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ..**




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:**భారతదేశమంతా స్వాతంత్రం వచ్చిన హైదరాబాద్ సంస్థానాన్ని పాలిస్తున్న నిజాం ను ఎదిరించడానికి గొరిల్లా యుద్ధమే చేయాల్సిన పరిస్థితి కమ్యూనిస్టులకు వచ్చిందని దానికి నాయకులుగా రావినారాయణ రెడ్డి ముందుండి కత్తులు, గొడ్డల్లు, పారలు, చేతికి దొరికిన ఆయుధాలతో నిజాం సర్కారు పై, రజాకారులపై దండెత్తి తెలంగాణ విమోచనం కలిగించారని , 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో నల్లగొండ ఎంపీ గా నెహ్రూ కంటే ఎక్కువ మెజార్టీతో గెలిచిన రావి నారాయణ రెడ్డి తో పార్లమెంటు ఓపెనింగ్ చేయించారని, నేడు కొందరు ఆయన చరిత్రను , కమ్యూనిస్టుల తాగాలను మరుగున పరిచేందుకు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, చరిత్ర ఎప్పటికీ నిజాలే చెప్తుందని గుర్తుంచుకోవాలని తెలియజేశారు... ఈ సందర్భంగా రావినారాయణ రెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు... నివాళులు అర్పించిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటియుసి మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సిపిఐ సీనియర్ నాయకులు గంగాపురం యాదయ్య, ఊట్కూరు శీను, ఎర్ర కిరణ్ కుమార్ గౌడ్, ఊట్కూరు కృష్ణ, పల్లె మల్లేశం తదితరులు పాల్గొన్నారు..

# బీజేపీ నాయకుల అక్రమ అరెస్టును ఖండించిన రామన్నపేట మండల బీజేపీ శాఖ



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 7:**రామన్నపేట మండల బీజేపీ నాయకుల అక్రమ అరెస్టును మండల శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య బీజేపీ మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి లను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..."15000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా 40 లక్షల మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.విద్యార్థుల హక్కుల సాధనకై ధర్నా చౌక్ లో 'విద్యార్థి మహాధర్నా'కు బీజేపీ పిలుపునిస్తే.. భయంతో వణికిపోయి అనుమతి నిరాకరించిన ఈ పిరికి, నియంత కాంగ్రెస్ సర్కారు బీజేపీ నాయకులను అక్రమ అరెస్టులు చేసి అరాచక పాలనను సృష్టిస్తోంది. ఇలాంటి చర్యలకు బీజేపీ ఎప్పటికీ భయపడదు.ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తే ఊరుకునేది లేదు. విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటం ఆగదు. ఈ అహంకార ప్రభుత్వ మెడలు వంచేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ను త్వరలోనే గద్దె దించి ఈ అరాచక పాలనను అంతమొందించే వరకు బీజేపీ పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.

# హామీల అమలులో పూర్తిగా విఫలమైన రేవంత్ రెడ్డి



**తొలి అక్షరం/మిర్యాలగూడ సెప్టెంబర్ 07:** వేములపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీల అమలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు దుమ్మెత్తి పోశారు, మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రజావాణిలో ఎంపీడీవో జ్యోతి కి కాంగ్రెస్ పార్టీ విఫల హామీలను అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు అనంతరం అద్దంకి నార్కెట్పల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టి 420 హామీలను ప్రజలకు ఆశపెట్టి టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ రైతుబంధు లాంటి ప్రధానమైన పథకాలను కూడా ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు, కనీసం అన్నం పెట్టే అన్నదాతలకు యూరియా ఇవ్వడంలో అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిర్ర మల్లయ్య యాదవ్ మజ్జిగ సుధాకర్ రెడ్డి కట్ట మల్లేష్ గౌడ్ సర్పంచ్ సందీప్ మాదిగ వివిధ గ్రామాల టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ తొలగింపు బీసీ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉంది: రాపోలు నరసింహా



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 2:**కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం బాధాకరమని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నరసింహా అన్నారు. బీసీ మహిళ, పద్మశాలి సమాజానికి చెందిన వ్యక్తి కావడం వల్లే చులకనగా చూస్తున్నారనే భావన బీసీల్లో కలుగుతోందని, ఇది సామాజిక న్యాయానికి సంబంధించిన అంశమని, పార్టీలకు అతీతంగా బీసీలు ఆలోచించాలని అన్నారు.

# ప్రజావాణిలో ప్రజా సమస్యలపై ఏడుగురు ఫిర్యాదులు

**తొలిఅక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 07:** నెల్లికుదురు మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిన్న ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు చేయడం జరిగింది. ప్రజావాణిలో ఏడుగురు ఫిర్యాదులు రావడం జరిగిందని అధికారులు చెప్పడం జరిగింది. ఇరిగేషన్ సమస్యపై ఒకటి, ఎనర్జీ సమస్యపై ఒకటి, హౌసింగ్ సమస్యతో రెండు ఫిర్యాదులు, రెవిన్యూ సమస్యలకు మూడు ఫిర్యాదులు మొత్తం ఏడు ఫిర్యాదులు రావడం జరిగిందని ఎంపీడీవో సింగారపు కుమార్, అధికారులు వెల్లడించారు.

# మారుమూల పాఠశాలలో అద్భుత సేవలు.. మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాలాజీ

**- ఏన్కూర్ మండలం గార్లఒడ్డు గ్రామానికి చెందిన గుగులోత్ బాలాజీకి అరుదైన గౌరవం**



**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 7:** మారుమూల ప్రాంతంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న ఏన్కూర్ మండలం గార్లఒడ్డు గ్రామానికి చెందిన గుగులోత్ బాలాజీ మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డుకు ఎంపికయ్యారు. వాజేడు మండలం జగన్నాధపురం ఎం.పి.యు.పి.ఎస్. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బాలాజీ విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణతో పాటు పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ గుర్తింపు దక్కింది.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వర్లు, వాజేడు నాగారం కాంప్లెక్స్ హెచ్ఎం సోయం ఆనందరావు చేతుల మీదుగా బాలాజీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మారుమూల ప్రాంతంలో అంకితభావంతో సేవలందిస్తూ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం పట్ల గార్లఒడ్డు గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**-రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**-ప్రజావాణి లో 56 వినతులు స్వీకరణ**

**- మట్టి వినాయకులనే పూజిద్దాం**

**- పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని పిలుపు**





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),సెప్టెంబర్7:** ప్రజల నుంచి వచ్చే సమస్యలను అధికారులు సత్వరమే, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు.సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ ఫిర్యాదులను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు నిరంతరం సమీక్షించాలని స్పష్టం చేశారు.ప్రజావాణిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 27,ఇతర శాఖలకు 29 చొప్పున మొత్తం 56 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ నెల 14న జరగనున్న వినాయక చవితిని పురస్కరించుకుని ప్రజలంతా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపి) విగ్రహాలకు దూరంగా ఉండి,మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేలా అధికారులు విస్తృత ప్రచారం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలకు సమగ్ర భద్రతా ప్రణాళిక

**- మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు అప్రమత్తంగా ఉండాలి: డీజీపీ సీవీ ఆనంద్**

**- సెప్టెంబరు 14 నుంచి ఉత్సవాలు...25న నిమజ్జనం**

**- విద్యుత్తు,ట్రాఫిక్ నియంత్రణ, జనసమూహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**






**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),సెప్టెంబర్7:** రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు.సెప్టెంబరు 14 నుంచి ప్రారంభమై 25న విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ఎస్‌ఐలు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. **మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో:**గణేశ్ మండపాల వివరాలను సేకరించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు డీజీపీ తెలిపారు. మండపం ప్రదేశం, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, నిమజ్జన వాహనాల వివరాలను ఇందులో నమోదు చేయాలని, ఎస్‌హెచ్‌వోలు తమ ప్రత్యేక లాగిన్‌లతో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సీపీలు, డీసీపీలు, ఎస్పీలు మండపాలను సందర్శించి పాయింట్ బుక్స్‌లో తనిఖీ వివరాలు నమోదు చేయాలన్నారు. మండపాల ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేసి, ఆ వివరాలను 'టీజీ-కాప్' ప్లాట్‌ఫామ్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. **విద్యుత్తు, ట్రాఫిక్ నిర్వహణపై పర్యవేక్షణ:**మండపాల వద్ద విద్యుత్తు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్తు, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. నిర్వాహకులు స్వచ్ఛంద కార్యకర్తలను ఏర్పాటు చేసుకునేలా చూడటంతో పాటు సీసీ కెమెరాలు, క్యూల నిర్వహణకు తగిన భద్రత కల్పించాలన్నారు. నిమజ్జన మార్గాలు, వంతెనల సామర్థ్యాన్ని ముందుగానే పరిశీలించి బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. **శాంతి కమిటీలతో సమన్వయం:**ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను ముందే పరిష్కరించుకోవాలని డీజీపీ తెలిపారు.సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచి వదంతులు వ్యాప్తి చేసే వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీ టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాసరావు, ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, ఐజీ మల్టిజోన్-1 చంద్రశేఖర్‌రెడ్డి, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, ఏఐజీ రమణకుమార్, హైదరాబాద్ డీసీపీలు అవినాష్‌కుమార్, విక్రాంత్‌కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికత...ప్రజారక్షణే
# తెలంగాణ పోలీసు ధ్యేయం

**• డీజీపీ సి.వి. ఆనంద్**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),సెప్టెంబర్7:** తెలంగాణ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా భద్రత,సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఒక నూతన శకానికి నాంది పలికింది.రాష్ట్రంలో నేర రహిత సమాజాన్ని నిర్మించడమే ఏకైక లక్ష్యంగా పోలీసు శాఖ ఆధునిక విధానాలను వేగవంతంగా అమలు చేస్తోందని డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేర రహిత సమాజ స్థాపనకు పోలీస్ శాఖ శ్రమిస్తోందని పేర్కొన్నారు.అదే సమయంలో పోలీసు అధికారుల ప్రవర్తన పట్ల తీవ్రంగా స్పందిస్తూ...సిబ్బంది వైఖరి వల్ల పోలీసు వ్యవస్థపై ప్రజల్లో ఎలాంటి ప్రతికూల (నెగెటివ్) అభిప్రాయం రాకూడదు అని కఠినంగా హెచ్చరించారు. **డిజిటల్ పోలీసింగ్ ద్వారా పారదర్శక సేవలు:** సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తూ పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. సిసిటిఎన్ఎస్, ఐసిజెఎస్: సిసిటిఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ అండ్ సిస్టమ్)క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్, (ఐసిజెఎస్) (ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్) క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతమైంది.టీజీ కాప్స్ యాప్: నిందితుల డేటాబేస్ నిర్వహణ, క్షేత్రస్థాయి పరిశీలన ఈ యాప్ ద్వారా మరింత సులభతరం మరియు పారదర్శకంగా మారింది. **మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై ఉక్కుపాదం:** రాష్ట్రంలో డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపుతున్నాం. 'డ్రగ్ ఫ్రీ తెలంగాణ' సాధనే లక్ష్యంగా ఈగల్ లాంటి ప్రత్యేక నిఘా విభాగాలను ఏర్పాటు చేశాం అని డీజీపీ స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును ప్రాథమిక స్థాయిలోనే మట్టుబెట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం అని ఆయన అన్నారు. **విజిబుల్ పోలీసింగ్ - ప్రజల్లో నమ్మకం:** ప్రజల్లో ధైర్యాన్ని, నేరస్థుల్లో భయాన్ని నింపడమే విజిబుల్ పోలీసింగ్ ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయిలో ప్రతీ అధికారి నిరంతరం అందుబాటులో ఉంటూ, వీధుల్లో గస్తీ (పెట్రోలింగ్) నిర్వహించడం ద్వారా శాంతిభద్రతలను పటిష్టం చేస్తున్నాం. పోలీసు వ్యవస్థపై సామాన్య ప్రజలకు పూర్తి నమ్మకం, భద్రతా భావం కలిగేలా చర్యలు చేపట్టాం. **సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక వ్యూహాలు** ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడం ఒక ప్రధాన సవాలుగా మారింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ( టీజీసీఎస్బీ) ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో నిఘాను పెంచాం. సైబర్ మోసాల పట్ల ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూనే, నిందితులను త్వరితగతిన పట్టుకుని బాధితులకు న్యాయం చేకూరుస్తున్నాం అని ఆయన అన్నారు. పోలీసు యంత్రాంగం నిష్పాక్షికంగా,పారదర్శకంగా పనిచేస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని డీజీపీ పునరుద్ఘాటించారు.

# గణేష్ ఉత్సవాల వేళ డీజే యజమానులకు బాండ్ ఓవర్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) సెప్టెంబర్ 7:** రానున్న గణేష్ ఉత్సవాలు, ప్రతిష్టాపన మరియు నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు తొర్రూరు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.దీనిలో భాగంగా తొర్రూర్ పట్టణంలోని డీజే సిస్టమ్ నిర్వాహకులను, సంబంధిత వ్యక్తులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తొర్రూర్ తహసిల్దార్ జి శ్రీనివాస్ ఎదుట హాజరుపరిచి బాండ్ ఓవర్ చేయించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, ఉత్సవాల సమయంలో నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు

# హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

**- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు**



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇవాళ హనుమకొండలో ఆ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం స్టూడెంట్లను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.ముఖ్య మంత్రి.. ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని తీసేస్తానని ఒకసారి,పాలిటెక్నిక్ ను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తామని మరో సారి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించేంత వరకూ తమ పార్టీ విద్యార్థుల పక్షాన పోరాడు తూనే ఉంటుందని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# మైదం చెరువు తండాలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**తొలి అక్షరం/కొడకండ్ల సెప్టెంబర్ 7:** కొడకండ్ల మండలం మైదం చెరువు తండా గ్రామ పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి సూచనలు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ప్రాజజ) ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి మార్గదర్శకత్వంలో అర్హులైన లబ్ధిదారులకు ఈ కార్డులను అందజేశారు.గ్రామ సర్పంచ్ సోనియా నరేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను నేరుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ ఫలాలు ప్రతి అర్హుడికీ చేరాలనే లక్ష్యంతోనే ఈ స్మార్ట్ రేషన్ కార్డులను విడతలవారీగా అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాలరాం, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, జిపిఓ బాలమల్లు, వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, గ్రామానికి చెందిన పెద్దలు, మహిళలు, యువకులు మరియు పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రాజీవ్ యువ వికాసం పథకం పరిస్థితి ఏంటి ?

**తెలంగాణ ప్రజల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బి ఆర్ ఎస్ వి నాయకులు**

**ముటుకులోజు రాఘవాచారి బి ఆర్ ఎస్ వి మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి**



**తొలి అక్షరం/చౌటుప్పల్:సెప్టెంబర్ 6:** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని బి ఆర్ ఎస్ వి మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముటుకులోజు రాఘవాచారి ఆరోపించారు. పథకం ప్రకటించి సుమారు 15 నెలలు దాటినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో పురోగతి కనిపించడం లేదని ప్రశ్నించారు.2026 బడ్జెట్‌లో రూ.6,000 కోట్లు కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ, రుణాలు ఎక్కడికి వెళ్లాయని, నిజంగా ఎంతమంది లబ్ధిదారులకు రుణాలు అందించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5 లక్షల మందికి లబ్ధి చేకూరుస్తామని చెప్పిన హామీ ఎంతవరకు అమలైందో వెల్లడించాలని కోరారు.అలాగే 2025 మార్చిఏప్రిల్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, ఇప్పటివరకు లబ్ధిదారులను ఎందుకు తేల్చలేదని బి ఆర్ ఎస్ వి నాయకులు ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో స్పష్టత లేకపోవడం వల్ల యువతలో అయోమయం నెలకొందని పేర్కొన్నారు.సబ్సిడీ రుణాలు ఎప్పుడు అందిస్తారు? బ్యాంకుల నుంచి నిధులు ఎందుకు రావడం లేదు? అనే ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు తక్షణమే రుణాలు అందించి, పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు.రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచి, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బి ఆర్ ఎస్ వి నాయకులు డిమాండ్ చేశారు.